సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025





## ● ఒకే రూపం.. అపురూపం

**దాబాగార్డెన్స్:** ఒకే పోలికతో ఉన్న ఇద్దరు కవలలు కనిపిస్తే ఒకింత వింతగా చూస్తాం. అదే ఒకేసారి 50 మంది కవలలు కనిపిస్తే సంభ్రమాశ్చర్యానికి గురవుతాం కదా. కవలల దినోత్సవం సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 50 మంది కలుసుకున్నారు. ఇలా వీరిని చూసిన వారంతా భలే ఉన్నారే.. అంటూ ముచ్చటపడ్డారు. ఒకే రూపంలో ఉన్న ఇద్దర్ని గుర్తుపట్టలేక తికమకపడ్డారు. ఎంతో సందడిగా కవలల దినోత్సవాన్ని నిర్వహించిన విశాఖకు చెందిన రామ్–లక్ష్మణ్, సోంపేటకు చెందిన రామరాజు–లక్ష్మణ రాజును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అభినందించారు.





ఇసుకతోట జాతీయ రహదారిపై గ్రూప్–2 అభ్యర్థుల ఆందోళన



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ..



పోలీసులను వేడుకుంటున్న అభ్యర్థి

# ధర్మాగ్రహం

- ప్రభుత్వం తీరును నిరసిస్తూ హైవేపై గ్రూప్–2 అభ్యర్థుల రాస్తారోకో
- ప్రభుత్వం, ఏపీపీఎస్సీలకు వ్యతిరేకంగా నినాదాలు



స్పృహ కోల్పోయిన అభ్యర్థిని తరలిస్తున్న స్నేహితులు

**ఎంవీపీకాలనీ:** ప్రభుత్వం తీరుపై గ్రూప్–2 అభ్యర్థులు ఆగ్రహించారు. శనివారం సాయంత్రానికి కూడా ప్రభుత్వం నుంచి గాని, ఏపీపీఎస్సీ నుంచి గాని గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష వాయిదాపై స్పష్టత రాకపోవడంతో సుమారు వెయ్యి మంది వరకు అభ్యర్థులు రాత్రి 7 గంటల సమయంలో ఎంవీపీ కాలనీలోని ఆర్‌సీ రెడ్డి కోచింగ్ సెంటర్ నుంచి ర్యాలీగా ఇసుకతోట కూడలికి చేరుకొని జాతీయ రహదారిని అష్టదిగ్బంధనం చేశారు. నాలుగు వైపులా రాకపోకలు బంద్ చేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అభ్యర్థులు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, ఏపీపీఎస్సీ చైర్మన్‌లకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ నిరసనలో భాగంగా పలువురు విద్యార్థులు స్పృహ కోల్పోవడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు పెద్ద ఎత్తున చేరుకున్నా అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఉండటంతో నిరసనను అడ్డుకోలేకపోయారు. గంటల తరబడి అభ్యర్థులు కదలకపోవడంతో చేసేది లేక జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను మళ్లించారు. భీమిలి ఆర్డీవోతో పాటు ఏసీపీలు నరసింహమూర్తి, అప్పలనాయుడు, శ్రీరామ్మూర్తులు అభ్యర్థులతో చర్చలు జరిపి శాంతింపజేశారు. రాత్రి 10 గంటల తరువాత అభ్యర్థులు నిరసనను విరమించారు. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు వేదికగా తెల్చుకుంటామంటూ హెచ్చరించారు.






అభ్యర్థులకు వార్నింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు



రోడ్డుపై బైఠాయించిన అభ్యర్థులు




## గ్రూప్–2 పరీక్షకు ఏర్పాట్లు

- నేడు 16 కేంద్రాల్లో పరీక్ష
- హాజరుకానున్న 11,029 మంది..

**మహారాణిపేట:** గ్రూప్–2 పరీక్షకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 16 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షకు మొత్తం 11,029 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఉదయం 9.45 తర్వాత, మధ్యాహ్నం 2.45 తర్వాత వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో నిర్దేశించిన సమయానికి సిబ్బంది చేరుకోవాలని కోరారు. పరీక్షల నిర్వహణ కోసం కోఆర్డినేషన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను నియమించారు. పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు ఆందోళన చేస్తుండడంతో కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాటు చేశారు.

**ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు**

పరీక్షల కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం లేదు. బబ్లింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, కొట్టివేతలకు తావివ్వరాదని, వైటనర్ వినియోగించరాదని అధికారులు సూచించారు. ఇన్విజిలేటర్లు నిబంధనలు పాటించాలని, పరీక్షకు ఐదు నిమిషాల ముందు మాత్రమే సీల్డ్ కవర్లో ఉన్న ప్రశ్నా పత్రాలను ఇవ్వాలని సూచించారు.

## న్యాయవాదులకు పుట్టినిల్లు విశాఖ

- విశాఖ న్యాయవాదుల సంఘానికి ఉజ్వల భవిష్యత్
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్

**విశాఖ లీగల్:** వందేళ్ల పండగకు సిద్ధమవుతున్న విశాఖ న్యాయవాదుల సంఘానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకటనారాయణ భట్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో విశాఖ న్యాయవాద సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంతో విస్తరిస్తున్న విశాఖ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. విశాఖ న్యాయవాదులకు అంతర్జాతీయ ఖ్యాతి ఉందని.. డి.వి.సుబ్బారావు వంటి న్యాయ కోవిదులు విశాఖవాసులు కావడం అదృష్టంగా అభివర్ణించారు. విశాఖను ప్రముఖ న్యాయవాదులకు పుట్టినిల్లుగా వివరించారు. 1989 నుంచి తనకు విశాఖతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. వందేళ్ల పండగకు తాను వస్తానని చెప్పారు. న్యాయవాదుల సేవలను ప్రస్తుతించారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బేవర సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ నగరం హైకోర్టు బెంచ్‌తో పాటు కేంద్ర ట్రిబ్యునల్ ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలమైనదిగా చెప్పారు. విశాఖకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్‌ను సఫలం చేసే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమాన్ని కార్యదర్శి డి.నరేష్ ప్రారంభించగా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నర్సింగరావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.లక్ష్మణరావు, పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డి.వి.వి.ఎస్.సోమయాజులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## 1,126 మందికి వీఆర్ఎస్

ఆమోదం తెలిపిన ఉక్కు సీఎండీ

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) జాబితాకు ఆమోద ముద్ర పడింది. దీంతో వీఆర్ఎస్‌పై ఉత్కంఠ తొలగిపోయింది. మొత్తం 1,126 మంది వీఆర్ఎస్‌కు అర్హత సాధించారు. 79 మంది దరఖాస్తులు తిరస్కరించారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జారీ చేసిన వీఆర్ఎస్ స్కీమ్‌లో భాగంగా ఈ నెల 19న నాన్ వర్క్స్‌కు చెందిన కార్మికులతో పాటు ఈ 4 స్థాయి వరకు అధికారుల జాబితా ప్రకటించారు. అప్పటి నుంచి వర్క్స్, నాన్ వర్క్స్‌లకు చెందిన ఈ 5, అంతకన్నా పైస్థాయి అధికారుల జాబితా పెండింగ్‌లో ఉంది. దీంతో దరఖాస్తు చేసిన వారు ఆ జాబితా కోసం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు సీఎండీ ఆ ఫైల్‌కు శనివారం ఆమోదం తెలిపారు. ఈ జాబితాలో 231 మందికి చోటు లభించింది. ఇదిలా ఉండగా తిరస్కరణకు గురైన వారికి ఈనెల 22 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. వాటిని మరో పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## ఈపీడీసీఎల్‌తో స్పానిటీ ఒప్పందం

**సాక్షి, విశాఖపట్నం:** విద్యుత్తు సరఫరా, సౌర విద్యుత్‌కు సంబంధించిన అంశాలపై అవసరమైన సాంకేతిక సహకారాన్ని తీసుకునేలా స్పానిటీ ఇనీషియేటివ్‌తో ఏపీఈపీడీసీఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సమక్షంలో సంస్థ ఎనర్జీ కన్జర్వేషన్ విభాగం సీజీఎం జె.శ్రీనివాసరావు సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో స్పానిటీ ఇనీషియేటివ్ సంస్థ ట్రస్టీ ఉమ భట్టాచార్య ఎంవోయూపై శనివారం సంతకాలు చేశారు. ఏపీఈపీడీసీఎల్‌లో అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూటెడ్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఉచితంగా అందించేందుకు అమెరికాకు చెందిన స్పానిటీ ఇనీషియేటివ్ సంస్థ ముందుకొచ్చింది.



స్పానిటీ సంస్థ ప్రతినిధులతో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

## కేజీహెచ్‌లో 9మందికి చికిత్స

**మహారాణిపేట:** జీబీఎస్ వ్యాధిగ్రస్తుల్లో ఒకరు శనివారం డిశ్చార్జ్ అయ్యారు. ఇంకా 9 మంది కేజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఒక రోగి వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు.

## చిన్నారికి ప్రాణం పోసిన వైద్యులు

ఊపిరితిత్తుల్లో చెట్టు కొమ్మ ముక్క తొలగింపు



చెట్టు కొమ్మ ముక్క

**బీచ్‌రోడ్డు:** ఊపిరితిత్తుల్లో చిక్కుకున్న చెట్టు కొమ్మ ముక్కను తొలగించి ఆరు నెలల బాబుకు ప్రాణం పోశారు మెడికవర్ వైద్యులు. ఒడిశాకు చెందిన ఆరు నెలల శిశువు తక్కువ రక్త ఆక్సిజన్ స్థాయి (60 శాతం)తో విషమ స్థితిలో ఉండగా వెంకోజీపాలెంలో గల మెడికవర్ హాస్పిటల్‌లో చేర్పించారు. డాక్టర్ హేమంత్, డాక్టర్ లక్ష్మణ్ నేతృత్వంలోని బృందం వెంటనే శిశువును బ్రాంకోస్కోపీ సూట్‌కు తరలించారు. శిశువు ఊపిరితిత్తుల్లో చెట్టు కొమ్మ ముక్క చిక్కుకున్నట్లు కనుగొన్నారు. దీనివల్ల వాయుమార్గం పూర్తిగా అడ్డంకిగా మారింది. వైద్య బృందం 10 నిమిషాల్లోనే బ్రాంకోస్కోపీ బాస్కెట్‌ని ఉపయోగించి ఆ కొమ్మ ముక్కను విజయవంతంగా తొలగించారు. శిశువుకు ఆక్సిజన్ స్థాయి మెరుగుపడింది. మరుసటి రోజే ఆ చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఆ తల్లిదండ్రులు వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



శిశువుతో వైద్య బృందం



# అసాంఘిక కార్యకలాపాలు నివారించాలి



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగరంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పూర్తిగా నివారించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. స్టేషన్ల వారీగా ఇన్‌స్పెక్టర్ల పనితీరును పరిశీలించారు. నగరంలో నిర్మానుష్య, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్, పికెట్, అవసరం మేరకు డికాయ్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉండాలని, గంజాయి ఎక్కడా ఉండకూదని, ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ వంటివి ఏ స్టేషన్ పరిధిలోను చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అదనంగా వెహికల్, మెన్ ఇతర అవసరాలు ఏమైనా ఉంటే తనకు తెలియజేయాలని తెలిపారు. నగరంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టీవ్‌గా ఉన్న రౌడీ షీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు. సైబర్ క్రైమ్‌పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల్లో నిందితులను గుర్తించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ–1 అజితా వేజెండ్ల, డీసీపీ–2 డి.మేరీ ప్రశాంతి, డీసీపీ(అడ్మిన్) కృష్ణ కాంత్ పటేల్, డీసీపీ (క్రైమ్) కె.లతామాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పప్పుల చీటీ పేరుతో ఘరానా మోసం

కూర్మన్నపాలెం: పప్పుల చీటీల పేరుతో పలువురిని మోసగించి రూ.45 లక్షలు కాజేసిన మహిళతో పాటు మరో ముగ్గురిని దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. వడ్లపూడికి చెందిన కె.సౌజన్యలతతో పాటు ఆమె భర్తను, ఆమె స్నేహితురాలిని, ఆ స్నేహితురాలి భర్తను శనివారం అరెస్టు చేసి దువ్వాడ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి దువ్వాడ పోలీస్ స్టేషన్ సీఐ కె.మల్లేశ్వరరావు అందించిన వివరాల మేరకు.. వడ్లపూడిలో నివాసం ఉంటున్న కె.సౌజన్యలత ఆమె భర్త శ్రీనివాసరావు పలువురిని నమ్మించి చీటీల వ్యాపారం ప్రారంభించారు. ప్రతి నెలా రూ.300, రూ.500 చెల్లిస్తే ఏడాది పూర్తయిన తర్వాత కిరాణా సామాన్లు, ఇతర వస్తువులు ఇస్తామని నమ్మబలికారు. వీరికి కొయిలాడ భారతి, ఆమె భర్త వెంకటరెడ్డి సహకరించారు. ఈ నలుగురూ కలిసి నెలనెలా బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసి చివర్లో చేతులెత్తేశారు. ఇలా సుమారు రూ.45 లక్షల వరకూ వసూలు చేసినట్టు బాధితులు ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన డబ్బులు తిరిగి చెల్లించాలని అనేక సందర్భాల్లో వారిపై ఒత్తిడి చేసినప్పటికీ అందుకు తగిన సమాధానం రాకపోవడంతో దువ్వాడ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదుతో నిందితులను అరెస్టు చేసి శనివారం న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

- భార్యకు తీవ్ర గాయాలు
- ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు



భార్య వరలక్ష్మి, కుమార్తె సాయితో మృతుడు లక్ష్మణరావు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొడుగుపాలేనికి చెందిన బంటుబిల్లి లక్ష్మణరావు (45) అనే కూరగాయల వ్యాపారి మృతి చెందగా.. అతని భార్య వరలక్ష్మికి తీవ్రగాయాలలయ్యాయి. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలు..ద్విచక్రవాహనంపై భార్యాభర్తలిద్దరూ వేమగొట్టిపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా అతి వేగంతో వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆరిలోవలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే లక్ష్మణరావు మృతి చెందాడు. వరలక్ష్మికి రెండు కాళ్లు విరిగిపోయాయి. లక్ష్మణరావు స్థానికంగా కూరగాయలు కొనుగోలు చేసి నగరంలోని విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె గతంలో మృతి చెందగా..మరో కుమార్తె సాయి 9వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులకు ప్రమాదం జరిగిందని కుమార్తె సాయికి సాయంత్రం వరకు తెలియదు. సాయంత్రం ఈ విషయం తెలియడంతో పొడుగుపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమార్తె సాయి, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మద్యం మత్తులో ఉన్న ఐటీ బీపీ విశ్రాంత ఉద్యోగి కారుతో బలంగా ఢీ కొట్టినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జాలర్లకు జాక్‌పాట్



మత్స్యపంట పండింది. దీంతో శనివారం ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకుంది. కొమ్ము కోణం, ట్యూనా,సౌర చేపలు భారీగా లభ్యమయ్యాయి. 20 కిలోల కొమ్ము కోణం చేపలు వలకు భారీగా చిక్కాయి. కేరళాలో కొమ్ము కోణం చేపలకు డిమాండ్ ఎక్కువ. దీంతో ఎగుమతి చేసేందుకు సిద్ధం చేశారు. కొమ్ము కోణం చేపలు భారీగా లభ్యమవడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. చాలా రోజుల తరువాత వలనిండా చేపలు లభ్యమయ్యాయని పేర్కొన్నారు.

-మహారాణిపేట/ ఫొటోలు :సాక్షి ఫొటోగ్రాఫర్



## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సినీ నటుడు విజయ్ దేవరకొండ
- మీ కోసం–మీ పోలీస్ పోస్టర్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న సినీ నటుడు విజయ్ దేవరకొండ

మహారాణిపేట: పోలీసు వ్యవస్థకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని సినీ నటుడు విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో కింగ్‌డమ్ చిత్ర షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'మీ కోసం–మీ పోలీస్' కరపత్రాన్ని విజయ్ విడుదల చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి సేవించవద్దని, బాగా చదువుకుని అభివృద్ధిలోకి రండి అని యువతకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విజయ్ దేవరకొండ స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

## జీవీఎంసీ వీఎల్‌టీ ఆదాయం రూ.78 లక్షలు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 పరిధి రుషికొండలోని సీఎస్ఐఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషినోగ్రఫీ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుంచి రూ.78,40,800 వీఎల్‌టీ మొత్తాన్ని జీవీఎంసీ అధికారులు వసూలు చేశారు. జోన్–2 రెవెన్యూ అధికారి రామనారాయణ ఆధ్వర్యంలో నగదును వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలు జీవీఎంసీకు పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## శివరాత్రికి భారీ ఏర్పాట్లు

దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ



మహారాణిపేట: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 26న శివరాత్రి జాగరణకు సంబంధించి దేవదాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. నగరంలో పలు ఆలయాలకు ఐదు వేల నుంచి ఏడు వేల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ తెలిపారు. తాగునీరు, ఉచిత ప్రసాదం, ఆలయాల వద్ద షామియానాలు, విద్యుత్ సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సముద్ర స్నానాలు ఆచరించే భక్తులు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా గజఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని ఆలయాల ఈవోలకు, మేనేజర్లకు ఏర్పాట్లపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

కెనాల్‌లో పడి తొమ్మిదేళ్ల బాలుడు మృతి

కంచరపాలెం: ఈత సరదా ఆ బాలుడు ప్రాణాలను బలిగొంది. కన్నవారిని తీవ్ర శోకంలో నెట్టింది. జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్ కాలనీకి చెందిన బి.తరుణ్ (9)..కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ప్రాథమిక పాఠశాల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు వెళ్లి తిరిగొచ్చే సమయంలో స్నేహితులు హర్షవర్ధన్, సుధీర్, విశాల్‌తో కలిసి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలోని కెనాల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఆ సమయంలో తరుణ్ గల్లంతయ్యాడు. స్నేహితులంతా భయపడి ఇంటికి వెళ్లిపోయారు. సాయంత్రం దాటినా తరుణ్ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన తల్లి పల్లవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కంచరపాలెం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇదిలావుండగా శనివారం ఉదయం కెనాల్‌లో తరుణ్ శవమై కనిపించాడు. దీంతో తోటి స్నేహితులను నిలదీయగా కెనాల్‌లో స్నానం చేసేందుకు వెళ్లామని చెప్పారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తరుణ్ మృతి చెందడంతో తల్లి పల్లవి కన్నీరుమున్నీరుగా విలపించింది. కంచరపాలెం సీఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 300 మంది పోలీసులకు రివార్డులు



రివార్డు ఆర్డర్‌ను అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో అనంతరం సిబ్బందికి సీపీ చేతుల మీదుగా రివార్డు మంజూరు ఆర్డర్లను అందించారు. గంజాయి, చోరీ, సైబర్ కేసుల ఛేదనలో ఉత్తమ ప్రతిభ చూపించిన హోంగార్డు నుంచి సీఐ స్థాయి అధికారి వరకు 300 మందికి రివార్డులు ఇచ్చారు.

## చేపలవేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి



మైలపల్లి దానయ్య(ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి దానయ్య (79) అనే మత్స్యకారుడు శనివారం చేపల వేటకు వెళ్లి సముద్రం మధ్యలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు మేరుగు ఎల్లాజీ, పంచాయతీ వార్డు సభ్యులు ముసలయ్య, రాము, రాజు తదితరులు పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఏడుగురు పోలీస్ సిబ్బందికి పదోన్నతి



పదోన్నతి పొందిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు పోలీస్ సిబ్బందికి పదోన్నతి లభించింది. ఒక ఏవోకు సీనియర్ ఏవోగా, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లగా, ఒక ఏఆర్ కానిస్టేబుల్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ దక్కింది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వీరిని శనివారం పోలీస్ సమావేశ మందిరానికి ఆహ్వానించి ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను అందజేసి సత్కరించారు.

## ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా మార్గాల్లో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ–షాలిమర్(08508) స్పెషల్ రైలు ప్రతీ మార్చి 11వ తేదీ నుంచి (ప్రతి మంగళవారం) ఏప్రిల్ 29వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో షాలిమర్– విశాఖ (08507) స్పెషల్ మార్చి 12 నుంచి ఏప్రియల్ 30 వరకు (ప్రతి బుధవారం) నడుస్తాయి. సంబల్‌పూర్–ఈరోడ్(08311) వీక్లీ స్పెషల్ మార్చి 12 నుంచి (ప్రతి బుధవారం) ఏప్రిల్ 30వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో మార్చి 14 నుంచి మే 2వ తేదీ వరకు (ప్రతి గురువారం) నడుస్తాయి. భువనేశ్వర్–యశ్వంత్‌పూర్(02811) వీక్లీ ఏసీ స్పెషల్ మార్చి 1వ తేదీ నుంచి (ప్రతి శనివారం) ఏప్రిల్ 26 వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో మార్చి 3వ తేదీ నుంచి ఏప్రిల్ 28వ తేదీ (పతి ఆదివారం) వరకు నడుస్తాయి.

## ఏపీఎంఈఎస్ఏ జీవీఎంసీ ప్రధాన కార్యదర్శిగా ఇరుసుమళ్ల

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఎంఇఎస్ఏ) జీవీఎంసీ ప్రధాన కార్యదర్శిగా జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇరుసుమళ్ల అప్పలరాజు నియమితులయ్యారు. ఏపీ ఎంఈఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, జెమ్స్ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఏపీఎంఈఎస్ఏ విశాఖ అసోసియేట్ ప్రెసిడెంట్ సన్యాసిరావు త్రిసభ్య కమిటీగా జరిగిన ఎంపికలో అప్పలరాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఇరుసుమళ్ల మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర నాయకుల సహాయ సహకారాలు, సీనియర్ల సూచనలతో బాధ్యతలు నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. త్వరలోనే జీవీఎంసీ ఉద్యోగులందరితో రాష్ట్ర నాయకులను ఆహ్వానించి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్టు చెప్పారు.

## వారాంతానికి రోడ్ల బృహత్ ప్రణాళిక

విశాఖ సిటీ: రహదారుల అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌ను వచ్చే వారం చివరి నాటికి పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శనివారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రణాళిక విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జోన్ల వారీగా అధికారుల పనితీరును పరిశీలించారు. ప్రణాళిక విభాగానికి సంబంధించిన న్యాయపరమైన కేసులను సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గరివిడి, అద్దూరు ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్న ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లో స్థలాలను సమీప ప్రాంతాల్లో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేసేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో సీయూపీ శిల్ప, ప్లానింగ్ అధికారులు వెంకటేశ్వరరావు, చామంతి, మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలంకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

దాబాగార్డెన్స్: మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం ఈ నెల 25న ప్రత్యేక సర్వీస్ నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు (రూ.1,230) ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరనుందని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7095605769, 9959225602, 9100109731 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

**శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు**

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 26 అర్ధరాత్రి నుంచి 27వ తేదీ సాయంత్రం వరకు గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి ప్రాంతాల నుంచి అప్పికొండకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. అలాగే తగరపువలస, భీమిలి, ఆరిలోవ, రవీంద్రనగర్, పెందుర్తి, కొత్తవలస, సింహాచలం, గాజువాక, కూర్మన్నపాలెం నుంచి ఆర్‌కే బీచ్‌కు ప్రత్యేక సర్వీసులు ఉంటాయని చెప్పారు. ప్రయాణికుల రద్దీని బట్టి అధికారుల పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.